INSANON KI KHIDMAT
(Telugu)

# మానవ సేవ

మూలం:

**మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమరి**

అనువాదం:

**అబ్దుల్ వాహెద్**

HYDERABAD


**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.


**MAANAVA SEVA**

***Insanon ki Khidmat*** **(Telugu)**


**TIP Series No. 92**

Written by : Maulana Syed Jalaluddin Umari

Translated by : Abdul Wahed



All Rights Reserved with Publishers



First Edition : November 2001

Copies : 2000

Price : Rs.8-00

ISBN : 81 - 86826 - 88 - 2

Published by : Telugu Islamic Publications
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 4564583
Fax : +91 +40 4576237

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# మానవ సేవ

## మానవ సేవ- దాని ప్రాధాన్యత

ఇస్లాంలో మానవ సేవకు, తోటివారి పట్ల మంచి వ్యవహార శైలికి చాలా ప్రాధాన్యం ఉంది. ప్రాణులకు సేవ చెయ్యడం సృష్టికర్తకు సేవ చేయడంతో సమానం అని అంటుంది ఇస్లాం. మానవ సేవను దైవ సేవతో సమానంగా పరిగణించింది ఇస్లాం. దైవ దాసులకు సహాయం చేయడం, వారికి తోడ్పడడం, దైవానికి తోడ్పడడంగా పేర్కొంది ఇస్లాం.

మీ ముందు నిలబడి ఎవరన్నా మనిషి చేయి చాపితే, మీరు అతడిని ఉత్తి చేతులతో పంపివేస్తే అది- మీరు దైవాన్ని ఉత్తి చేతులతో పంపినట్లే లెక్క. అలాగే ఎవరన్నా వ్యాధిగ్రస్తునికి మీ సహాయం అవసరమైతే, మీరు అతడికి సహాయాన్ని నిరాకరిస్తే- మీరు దైవానికి సహాయంచేయ నిరాకరించినట్లే పరిగణించబడుతుంది. దైవాన్ని సంతుష్టుణ్ని చేయడానికి, తోటి మానవులను సంతోషపెట్టడం, వారికి సుఖాన్ని కలగజేయడం ఎంతో అవసరం. మనం భూమిపై ఉన్నవారి పట్ల కరుణాకృపలతో వ్యవహరించినప్పుడే ఆకాశంలో ఉన్నవాడు తన కరుణాకటాక్షాలను మనపై ప్రసరిస్తాడు. క్రింది హదీసులో ఈ వాస్తవం హృదయానికి హత్తుకునేలా చెప్పడం జరిగింది.

**మహాప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు, "దేవుడు ప్రళయ దినాన ప్రశ్నిస్తాడు: 'ఆదం పుత్రుడా, నేను వ్యాధిగ్రస్తుణ్ణయి ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించలేదే?' అని. దానికి మనిషి కంగారుపడిపోతూ, 'నా స్వామీ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నీవయితే సర్వలోకాల**



**ప్రభువు కదా!' అని విన్నవించుకుంటాడు. ఆ తర్వాత దేవుడు 'నీకు గుర్తుందా? నా ఫలానా దాసుడు అనారోగ్యంతో పడి ఉన్నప్పుడు నీవు పరామర్శకు వెళ్ళలేదు. నీవు అతన్ని పరామర్శించి ఉంటే, నన్ను అక్కడ దర్శించేవాడివి' అని అంటూ మళ్ళీ ఇలా ప్రశ్నిస్తాడు: 'ఆదం పుత్రుడా! నేను నిన్ను అన్నం అడిగాను. కాని, నీవు నాకు అన్నం పెట్టలేదే.' దానికి మనిషి, 'నా స్వామి! నీకు ఆకలి కావడం ఏమిటి? నీవే సకల లోకాల పరిపోషకుడివి కదా!' అంటాడు. అప్పుడు దేవుడు, 'నీకు గుర్తు లేదా! నా ఫలానా దాసుడు నీ వద్దకు వచ్చి అన్నం అడగ్గా, నీవు అతనికి అన్నం పెట్టలేదు. నీవు అతనికి అన్నం పెట్టి ఉంటే దాని పుణ్యఫలం నేడు నా వద్ద పొందేవాడివని నీకు తెలీదా?' అని పలికి దైవం తిరిగి ఇలా అడుగుతాడు: 'ఆదం కుమారా! నేను దాహంతో నిన్ను నీళ్ళు అర్థిస్తే నీవు నా దాహం తీర్చలేదు.' దానికి మనిషి, 'స్వామీ! నేను నీకు దాహం తీర్చడం ఏమిటి? నీవు యావజ్జగతుకు ప్రభువు కదా!' అని విన్నవించుకుంటాడు. అప్పుడు అల్లాహ్ 'నా ఫలానా దాసుడు నిన్ను నీటికై అర్థించాడు. కాని నీవు అతనికి నీళ్ళు ఇవ్వలేదు. నీవు అతని దాహం తీర్చి ఉంటే దాని పుణ్యఫలాన్ని ఇప్పుడు నా వద్ద పొందేవాడివి' అని అంటాడు." (ముస్లిమ్, అబూ హురైరా)**

## మానవ సేవ కూడా దైవారాధనే

దైవ సామీప్యాన్ని పొందడానికి, దైవ ప్రీతిని బడయడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి, మనిషి తన భావావేశాలలోనూ, అభిప్రాయాలలోనూ దైవానికి దగ్గరవ్వాలి. దైవం ముందు తనను తాను అర్పించుకొంటూ నిలబడాలి. తన తలను వంచాలి, సాష్టాంగ పడాలి. దానికి మంచి మార్గం 'నమాజ్'. ఇక రెండవ పద్ధతి: దైవదాసులయిన మానవులకు సేవ చేయాలి. తోటివారితో మంచిగా మెలగాలి. 'జకాత్' ఇందుకు ముఖ్యమార్గం. నమాజ్ అన్నది శారీరక ఆరాధన. జకాత్ ఆర్థిక ఆరాధన. నమాజ్ మానవుని తరఫున దైవ ఘనతను, తన అల్పతను చాటే ప్రకటన. జకాత్ మనిషి హృదయంలో దాగివున్న సానుభూతి,

ఇతరుల దుఃఖాన్ని పంచుకొనే భావనలను చాటి చెబుతుంది. మనిషి ఇతరుల కొరకు తన సంపద ఖర్చుచేస్తాడని తెలుపుతుంది. ఖుర్ఆన్‌లో నమాజ్ ప్రస్తావనతోపాటు, జకాత్ ప్రస్తావన కలిసి ఉంది. రెండింటికి సమాన ప్రాధాన్యత ఇచ్చాడు దైవం. వాటిని పాటించాలని అనేకసార్లు తాకీదు చేసాడు. దైవం వద్ద ఆర్థిక ఆరాధన, శారీరక ఆరాధన కన్నా ఏమాత్రం తక్కువ కాదు. దైవాన్ని సంతోషపరచాడనికి శారీరక ఆరాధన ఎంత అవసరమో ఆర్థిక ఆరాధన కూడా అంతే అవసరం. దైవం పంపిన ధర్మం కేవలం మనిషి దైవం ముందు విశ్వాసంతో ప్రేమతో తలవంచి నిలబడాలని మాత్రమే బోధించదు. మానవుడు తన సంపాదనలో తన తోటి వారి హక్కులను కూడా గుర్తించి అవసరార్థులక కోసం దాన్ని ఖర్చు చేయాలి.

**"వారు అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలనీ, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, నమాజ్ స్థాపించాలనీ, జకాత్ ఇస్తూ ఉండాలనీ మాత్రమే ఆదేశించడం జరిగింది. ఇదే ఎంతో సరియైన, సవ్యమైన ధర్మం." (అల్ బయ్యినహ్)**

## మానవ సేవ వల్ల ఆరాధనల్లో లోపాలకు మినహాయింపు

కొన్ని సందర్భాల్లో ఇస్లాం మానవ సేవకు శారీరక ఆరాధన అంతటి ప్రాముఖ్యం ఇస్తుంది.

నమాజ్ వలె రోజా కూడా శారీరక ఆరాధనే. రోజాలో మనిషి దైవం కోసం ఆకలిదప్పులు భరిస్తాడు. తన కోరికలపై, భావావేశాలపై నియంత్రణ సాధించే ప్రయత్నం చేస్తాడు. కష్టాల్లో ఉన్న తోటివారికి సహాయం చేయడం, వారికి తోడ్పడడాన్ని ఈ శారీరక ఆరాధనతో సమానంగా నిర్ణయించింది ఖుర్ఆన్. అంటే రెండూ సమాన స్థాయిగల ఆరాధనలు. దైవం వద్ద వాటికి సమాన హోదా ఉంటుంది.

రోజా గురించిన ఓ ప్రారంభ ఆదేశంలో **"శక్తి ఉన్నప్పటికీ రోజా పాటించని వ్యక్తి ఓ నిరుపేద వ్యక్తికి అన్నం పెట్టాలి"** (బఖర:1-4) అని ఉంది.



**"ముస్లిములతో ఒప్పందం కుదుర్చుకొని ఉన్న వేరే జాతి మనిషిని ఓ ముస్లిం గనుక హత్య చేస్తే హతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలి. ఇంకా ఓ ముస్లిం బానిసను విడుదల చేయాలి. అలా చేసే శక్తిలేని వాడయితే రెండు నెలలపాటు ఎడతెగకుండా రోజా పాటించాల్సి ఉంటుంది." (అన్ నిసా : 94)**

**"ఎవరైనా వ్యక్తి తన భార్యను తల్లిగా పరిగణించి, మళ్ళీ ఆమెను స్వీకరించదలిస్తే, దానికి ఆ వ్యక్తి పరిహారంగా ఓ బానిసను విడుదల చేయాలి. ఎడతెగకుండా 40 రోజాలు పాటించాలి. లేదా అరవై మంది అగత్యపరులకు అన్నం పెట్టాలి." (ముజాదిలా: 3,2)**

**"ప్రమాణ భంగానికి పరిహారంగా పది మంది అగత్యపరులకు భోజనం, దుస్తులు పెట్టాలి లేదా ఓ బానిసను విడుదల చేయాలి లేదా మూడు రోజాలు పాటించాలి." (అల్ మాయిద:89)**

హజ్, నమాజ్, రోజాల వలె కేవలం శారీరక ఆరాధన కాదు. ఎందుకంటే ఇందులో డబ్బు ఖర్చు చేయవలసి ఉంటుంది. కాని ఇది ఆర్థిక ఆరాధనకన్నా శారీరక ఆరాధనగా ఎక్కువ పరిగణనలోకి వస్తుంది. ఈ సందర్భంగా ఖుర్ఆన్ ఆదేశం:

**"హజ్ కాలం వచ్చే వరకు మీలో ఎవరన్నా సరే 'ఉమ్రహ్' చేసినట్లయితే వారు తమ శక్తికి తగు విధంగా ఖుర్బాని ఇవ్వాలి. ఖుర్బాని ఇవ్వలేకపోతే హజ్ కాలంలో మూడు ఉపవాసాలు, ఇంటికి తిరిగి వచ్చిన పిదప ఏడు ఉపవాసాలు మొత్తం పది ఉపవాసాలు ఉండాలి."(బఖర : 196)**

ఈ ఆదేశాల్లో బానిసలను విడుదల చేయడం, నిరుపేదలకు అన్నవస్త్రాలను ఇవ్వడం, ఖుర్బాని ద్వారా పేదలకు సహాయపడడం – వీటికి రోజాతో సమాన ప్రతిపత్తి కల్పించబడింది. శారీరక ఆరాధనల్లో చోటుచేసుకొన్న లోపాలను పూర్తి చేయడానికి ఆర్థిక ఆరాధన ఓ మార్గంగా చూపబడింది. దాతృత్వాన్ని, సహాయాన్ని ప్రదర్శించాలని సూచించడం జరిగింది.

**“హజ్ కాలంలో మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకు లోనై శిరోముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసముండాలి. లేదా దానధర్మాలు చెయ్యాలి. లేదా ఖుర్బాని ఇవ్వాలి.” (అల్ బఖర: 196)**

**రమజాన్ మాసంలో రోజాల తరువాత దానధర్మాలు చేయాలని ఆదేశం ఉంది. దాని ప్రయోజనాలను చెబుతూ అలా చేయడం వల్ల రోజాలలో జరిగిన లోటుపాట్లు పూరించబడతాయని ఉంది. (అబూ దావూద్)**

అంతకు మించిన మాట మరొకటి ఉంది. ముసలితనం, వ్యాధి కారణంగా రోజా పాటించే శక్తి లేనివారు ఒక్కో రోజాకు బదులు ఓ బీదవానికి రెండు పూటలా అన్నం పెట్టాలన్న ఆదేశం ఉంది.

దైవానికి, మానవునికి మధ్య సంబంధాల్ని దృఢం చేయడంలో శారీరక ఆరాధనకు ఎంతైనా ప్రాముఖ్యం ఉంది. దైవస్మరణ, తస్బీహ్, రుకు, సజ్దా, దుఆలు లేకుండా ఏ వ్యక్తికీ దైవసామీప్యం ఎంత మాత్రం లభించదు. దానితో బాటు ఖుర్ఆన్ మానవ సేవను, తోటివారితో మంచి వ్యవహార శైలికిని శారీరక ఆరాధనకు దీటుగా నిలబెట్టి ఈ ఆర్థిక ఆరాధనకు మత వ్యవహారాల్లో అత్యున్నత స్థానానిచ్చింది.

## మానవ సేవ వివిధ రకాలు

సమాజ సేవకు, తోటి వారితో మంచి వ్యవహార శైలిని కలిగి ఉండడానికి ఓ నిర్ధారిత పద్ధతి అంటూ ఏదీ లేదు. ఈ సేవ అనేక విధాలుగా ఉండవచ్చు.

**తాత్కాలిక సహాయం:** తాత్కాలికంగా అవసరార్థులను ఆదుకోవడం ఓ విధమైన సేవాకార్యం. ఒక్కోసారి మనిషికి తాత్కాలిక సహాయం ఎంతైనా అవసరమవుతుంది. అతడి అవసరాన్ని ఏ మాత్రం ఉపేక్షించినా ఆ వ్యక్తికి తీవ్ర నష్టం వాటిల్లవచ్చు. వ్యాధిగ్రస్తునికి అత్యవసర మందులు లభ్యం కాకపోతే, లేదా ఆకలితో అలమటిస్తున్న వ్యక్తికి గుప్పెడు మెతుకులు లభ్యం కాకపోతే అతగాడి జీవితమే సమాప్తమయిపోతుంది. నిరుపేదలు, నిస్సహాయులు మాత్రమే కాదు, సుఖప్రదమైన జీవితాన్ని గడుపుతున్న వ్యక్తికి కూడా ఎప్పుడైనా ఈ పరిస్థితి



రావచ్చు. తాత్కాలిక అవసరాలకు మనిషి సంపదతో సంబంధం లేదు, ఇవి కేవలం పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. దారిలో పర్సు పోగొట్టుకోవడం వల్ల ఇంటికి చేరడం కష్టంగావచ్చు. అప్పుడు మనం అలాంటి వ్యక్తికి తప్పక సహాయం చేయవలసి ఉంటుంది. ఆ వ్యక్తి ఇంటికి చేరడానికి అవసరమైన సొమ్మును అందించాలి. అతడు ఇంటికి చేరేందుకు తోడ్పడాలి. ధనికుడైన వ్యక్తికి కూడా కొన్ని పరిస్థితుల్లో సహాయం కోరే అవసరం ఏర్పడవచ్చు. అప్పుడు కూడా ఆ అవసరార్థికి సహాయం చేయాలి. ఈ వాస్తవం క్రింది హదీసులో చక్కగా వివరించబడింది. ఈ హదీసును ఇమాం హుస్సేన్ (రజి) ఉటంకించారు.

**“యాచించేవాడు గుర్రంపై స్వారి చేస్తున్నప్పటికీ అతడికి మీపై హక్కు ఉంది” అని ప్రవక్త ముహమ్మద్ (స) అన్నారు. (మిష్కాత్)**

మరో హదీసులో హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉటంకించారు.

**రసూలుల్లా (స) ఇలా అన్నారు: “ఆకలి కడుపును నింపడం అత్యుత్తమ దానం.” (మిష్కాత్)**

**ఉమ్మె బజీద్ (రజి) ఓసారి ప్రవక్త ముహమ్మద్ (స)తో “హుజూర్ (స) ఎప్పుడయినా ఎవరన్నా అవసరార్థి నా గుమ్మం ముందు నిలబడినప్పుడు నా వద్ద అతడికి ఇవ్వడానికి ఏమీ లేకపోతే చాలా సిగ్గుపడవలసి వస్తుంది” అన్నారు. అప్పుడు ప్రవక్త (స) “ఆ అవసరార్థిని ఉత్తచేతులతో పంపవద్దు. ఏమీ లేకపోతే కనీసం కాల్చిన మేక డెక్కనయినా ఇవ్వు” అన్నారు. (మిష్కాత్)**

**అవసరాలను శాశ్వతంగా తీర్చడం:** సమాజ సేవలోని మరో కోణమిది. కష్టాల్లో కూరుకుపోయిన వ్యక్తి, ఆ కష్టాల నుంచి శాశ్వతంగా బయటపడే విధంగా తగు ఏర్పాట్లను చేయడానికి ఆ వ్యక్తి సమస్యలను తాత్కాలిక వెసులుబాటు కాదు, శాశ్వత పరిష్కారం వెదికి ఇవ్వాల్సి ఉంటుంది. జీవిత పోరాటంలో ఆ వ్యక్తి వెనుకబడటానికి గల కారణాలను కనుగొని వాటిని నివారించాలి. ఆకలితో అలమటిస్తున్న వ్యక్తికి అన్నం తినిపించడం అన్నది

నిస్సందేహంగా సత్కార్యం. అలాగే చిరిగిన చాలీచాలని బట్టలు తొడిగిన వ్యక్తికి క్రొత్త బట్టలను గాని, పాత బట్టలనుగాని ఇవ్వడం కూడా సత్కార్యమే. కాని వీటితోపాటు అసలైన సత్కార్యం, నిజమైన సేవ ఆ నిరుపేదల బీదరికాన్ని తొలగించడం. వారికి ఆకలిదప్పులతో ఉండవలసిన పరిస్థితి భవిష్యత్తులో కలుగకుండా, ఇతరులను యాచించే స్థితి నుంచి వారిని పైకి లాగడం.

> **"పాలిచ్చే ఒంటెను లేదా మేకలను కొంత కాలానికిగాను దానంగా ఎవరికన్నా ఇవ్వడం అన్నది అత్యుత్తమ దానం. తద్వారా ఆ వ్యక్తి ప్రొద్దుట, సాయంత్రం ఆ పశువుల పాలు త్రాగి, పాలు అయిపోయిన తరువాత తిరిగి ఇచ్చేయాలి" అని ఓ హదీసులో ఉంది. (మిష్కాత్)**
>
> **మరో హదీసులో – "ఎవరన్నా వ్యక్తి తన పాలు ఇచ్చే మేకను కొంతకాలం కోసం ఎవరికన్నా ఇచ్చినా, తన డబ్బు అప్పుగా ఇచ్చినా, తను ఎవరికన్నా దారి చూపినా అతడికి ఓ బానిసకు స్వేచ్ఛ ప్రసాదించిన దానికి సమానమైన పుణ్యం లభిస్తుంది." (మిష్కాత్)**

కేవలం కొన్ని రోజులు ఎవరి కష్టాలన్నా తీర్చితే ఇంత పుణ్యం లభిస్తుందే, ఇక ఎవరి బీదరికాన్నయినా తీర్చి అతడిని సుఖమయమైన జీవితాన్ని గడపడానికి తగినవాడిగా తయారు చేస్తే ఎంత పుణ్యం లభిస్తుందో, దైవం వద్ద అతనికి ఎంత ప్రతిఫలం లభిస్తుందో మీరే ఊహించండి.

**ప్రజా సంక్షేమ కార్యాలు:** మానవ సేవ, సత్కార్యాలు, మంచిగా మెలగడంలో మూడో అంశం ప్రజాసంక్షేమ కార్యాలు. పాఠశాలలు, ఆసుపత్రులు కట్టించడం, రోడ్లు, వంతెనలు నిర్మించడం, ధర్మసత్రాలు, అనాధ శరణాలయాలు నిర్వహించడం. ఇవన్నీ ప్రజాసంక్షేమ కార్యకలాపాలే. ఇలాటి పనుల వల్ల కేవలం ఒక్క వ్యక్తి మాత్రమేకాక పూర్తి సమాజం ప్రయోజనాన్ని పొందుతుంది. అందువల్ల ఈ పనులకు అధిక ప్రాధాన్యత ఉంది. ఓ వ్యక్తికి మంచి విద్యాబుద్ధులను ఇప్పించి సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి చేర్చడం వల్ల కేవలం ఆ వ్యక్తికి మాత్రమే సేవ చేసినట్లవుతుంది. కాని ఓ మంచి స్కూలును నడపడం వల్ల ఆ స్కూలు నుంచి లెక్కలేనంత మంది పిల్లలు విద్యాబుద్ధులు నేర్చి బయటకు



వస్తారు. ఇది పూర్తి సమాజ సేవ. దీనివల్ల ఓ వ్యక్తిపై మరో వ్యక్తికి ఉన్న హక్కులూ నెరవేరుతాయి. వాటితో పాటు సమాజానికి గల హక్కును నెరవేర్చినట్లవుతుంది. ఈ రెండు రకాల హక్కులను నెరవేర్చాలంటే ప్రజాసంక్షేమ కార్యాలను చేపట్టడం అవసరం. దానితో పాటు మరో వైపు భార్యాపిల్లలు, స్నేహితులు, బంధువుల హక్కులను కూడా నెరవేర్చడం ఆ వ్యక్తి బాధ్యత. అలాగే సమాజంలో సభ్యునిగా అతను తనపై ఉన్న బాధ్యతలను కూడా విస్మరించరాదు. ఈ బాధ్యతలను ముందుంచుకొని వాటిని నెరవేర్చడంలో బద్ధకించనివాళ్ళే సమాజంలోని అత్యుత్తమ వ్యక్తులు. ప్రతి వ్యక్తికి తన దగ్గరి వాళ్ళపై ప్రేమానురాగాలుంటాయి. ఇతరులకన్నా తన దగ్గరి వాళ్ళకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు. ఇది మానవ సహజం. కొంత వరకు ఈ సృజన, అభిమానం ఉండటం తప్పుకాదు. కాని, కొంతమంది సమాజాన్ని నష్టపరచి మరీ తమ కుటుంబ సభ్యుల ప్రయోజనాల్ని సాధించుకుంటారు. ఇలాటి వ్యక్తులు సమాజానికి చీడపురుగులు. సమాజానికి ఎలాటి నష్టం కలిగించకుండా తనవారి ప్రయోజనాలను కాపాడే వ్యక్తి ఎల్లవేళలా సమాజశ్రేయస్సును అభిలషించేవాడు నిజమైన సమాజ శ్రేయోభిలాషి. అలాటి వ్యక్తులున్న సమాజం అభివృద్ధిని సాధించగలదు. సమాజాన్ని పైకి లాగే ప్రయత్నం చేసేవారు, సమాజానికి ఎలాటి నష్టమూ కలుగకుండా జాగ్రత్తపడేవారు సభ్యులుగా ఉన్న సమాజం పురోభివృద్ధిని సాధిస్తుంది. మనిషి తన వారి హక్కులను నెరవేర్చాలని బోధిస్తూ ఇస్లాం, అదే సమయాన సమాజ సంస్కరణకు, దాని పురోభివృద్ధికి ఉపయోగపడాలని తాకీదు చేసింది. ఆ రకంగా మనిషి సామూహిక ప్రయోజనాల కోసం పని చేయాలని అనేకసార్లు ఆదేశించింది. ఆయా పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఈ క్రింది హదీసుల్లో ఆ విషయం స్పష్టమవుతుంది.

> **1. హజ్రత్ అబూ హురైరా ఉటంకించారు: "ముహమ్మద్ ప్రవక్త(స) ఇలా అన్నారు, 'నేను ఓ మనిషిని స్వర్గంలో తిరుగుతుండగా చూసాను. (ఆ వ్యక్తి చేసిన మంచి పని ఏమిటంటే) ఆ వ్యక్తి ప్రపంచంలో ఓ రహదారికి అడ్డంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఓ చెట్టును నరికాడు." (మిష్కాత్)**

ఆ వ్యక్తి ప్రజల సౌలభ్యం కోసం వారి మార్గంలో ఉన్న ఓ అడ్డంకిని తొలగించాడు. అందువల్ల అతడికి స్వర్గం సుగమమయ్యింది. ఎలాంటి అడ్డులేకుండా స్వర్గంలోని ఉద్యానవనాల్లో విహరించడం సాధ్యపడింది.

**2. హజ్రత్ అబూ హురైరా ఉటంకించిన మరో హదీసు: ముహమ్మద్ (స) ఇలా అన్నారు. "ఓ వ్యక్తి దారినపోతూ ఆ దారికి అడ్డంగా పడి ఉన్న ఓ పెద్ద చెట్టు కొమ్మను చూసాడు. దారినపోయే మరో ముస్లింలకు కష్టం కలుగరాదన్న ఉద్దేశ్యంతో అతడు ఆ కొమ్మను తొలగించాడు. (దైవానికి అతడు చేసిన పని నచ్చింది. ప్రతిఫలంగా) అతడిని స్వర్గంలోకి పంపాడు." (మిష్కాత్)**

పై హదీసులో దారికి అడ్డంగా ఉన్న ఓ చెట్టును కొట్టడం వల్ల మనిషి స్వర్గానికి అర్హుడని చెప్పడం జరిగింది. రెండవ హదీసులో కేవలం ఓ చెట్టు కొమ్మను దారి నుంచి తొలగించినంతనే స్వర్గం లభిస్తుందని చెప్పడం జరిగింది. ప్రజల మార్గంలో ఉన్న అతిచిన్న అడ్డంకిని తొలగించడం, ప్రజలకు స్వల్ప ప్రయోజనాన్ని చేకూర్చడంలాంటి చిన్న పనులు కూడా మనిషిని స్వర్గానికి అర్హుడిగా చేయగలవని దీన్నిబట్టి అర్థమవుతోంది.

**3. హజ్రత్ సాద్ బిన్ ఇబాద (రజి) తల్లిగారు మరణించారు. హజ్రత్ సాద్ (రజి) తన తల్లి పేర దానధర్మాలు చేయాలని సంకల్పించారు. అందుకోసమని ఆయన ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి ఏ దానం అన్నింటికన్నా మంచిదని అడిగారు. అప్పుడు ప్రవక్త (స) 'బావి త్రవ్వించు' అన్నారు. హజ్రత్ సాద్ (రజి) తన తల్లి పేర ఒక బావిని త్రవ్వించారు. (మిష్కాత్)**

బావులు త్రవ్వించడం ప్రజాసేవలోని ఓ భాగం. ఇలాటి సేవా కార్యక్రమాలు ఇంకా చాలా ఉన్నాయి. ఈ హదీసు ప్రకారం దైవమార్గాన ఖర్చుపెట్టాలని అనుకొంటే తమ సంపదను ప్రజాసేవలో ఖర్చుపెట్టాలని, అలా చేయడం అన్నింటికన్నా గొప్ప దానమని తెలుస్తుంది.



**4. హజ్రత్ అబూ హురైరా (రజి) ప్రవక్త ముహమ్మద్ (స)తో 'నేను ప్రయోజనాన్ని పొందగల మాట ఏదన్నా ఉంటే చెప్పండి' అని కోరారు. అప్పుడు ప్రవక్త (స) ఆయన్ను 'ముస్లింల మార్గం నుంచి ఆటంకాలను తొలగించు' అని చెప్పారు. (మిష్కాత్)**

ఇది చాలా విస్తృత భావంతో కూడిన హదీసు. ఇందులో ముస్లింల మార్గం నుంచి చిన్న పెద్ద అడ్డంకులు తొలగించాలని నొక్కి చెప్పడం జరిగింది. దారిలో ఉన్న ముళ్ళు, రాళ్ళు తొలగించడం కూడా పుణ్యకార్యాలే. ఇలా చేయడం వల్ల మనిషికి తీర్పు దినాన తప్పక లాభం కలుగుతుంది. కాని, అంతకన్నా ముఖ్యమైన పని ఏదంటే, సమాజంలో జడలు విప్పి ఉన్న రుగ్మతలనబడే ఆటంకాలను తొలగించడం. ఆ రుగ్మతలను తొలగించకపోతే సమాజం అభివృద్ధి సాధించలేదు. పేదరికం, వ్యాధులు, అజ్ఞానం, జాతి తత్వం, వర్గ వైషమ్యాలు చోటుచేసుకొన్న సమాజం, ఉత్తమ ఆదర్శాల కోసం త్యాగాలు చేయలేని వ్యక్తులున్న సమాజం, ఎన్నటికీ గౌరవప్రదమైన ఉన్నత స్థానాన్ని పొందలేదు. ఆ సమాజానికి చేయదగ్గ ఉత్తమ సేవా కార్యం ఆ సమాజాన్ని నైతికంగా పైకి లాగడం. ఆ తరువాత ఆర్థికంగా దానికి పరిపుష్టిని చేకూర్చడం.

**5. హజ్రత్ అబూ హురైరా (రజి) ఉటంకించిన మరో హదీసులో ముహమ్మద్ ప్రవక్త (స) ఇలా అన్నారు: "విశ్వాసి మరణించిన తరువాత కూడా అతని ఏ సత్కార్యాల పుణ్యం అయితే లభిస్తూనే ఉంటుందో ఆ సత్కార్యాలలో కొన్ని అతడు ప్రపంచంలో ప్రచారం చేసిన ధార్మిక విద్య, ఆ వ్యక్తికి కలిగిన ఉత్తమ సంతానం(ఎందుకంటే వారిని పుణ్య కార్యాలు చేసేలా అతను తీర్చిదిద్దాడు), అతడు విడిచి వచ్చిన ఖుర్ఆన్ షరీఫ్(దానితో ప్రజలు లాభం పొందుతుంటారు), అతడు కట్టించిన మస్జిదు, అతడు కట్టించిన ధర్మసత్రం, అతడు త్రవ్వించిన కాలువ, అతడు తన సొమ్ముతో తాను ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసిన దానాలు- ఇవన్నీ శాశ్వత పుణ్యకార్యాలలో చేరి ఉన్నాయి." (మిష్కాత్)**

షరీఅత్ (ముస్లిం ధర్మశాస్త్రం) ప్రజాసంక్షేమ కార్యాలకు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ హదీసులు వివరిస్తున్నాయి. షరీఅత్‌లో ఇవి **'సదఖాతె జారియా'** అని పేరుపడ్డాయి. ఎందుకంటే వీటివల్ల అతడు తన మరణానంతరం కూడా పుణ్యాల్ని పొందుతూ ఉంటాడు.

**ప్రజాసేవా సంస్థలు :** వ్యక్తి దగ్గర కొద్దిపాటి శక్తిసామర్థ్యాలు మాత్రమే ఉంటాయి. అందువల్ల ప్రజాసేవలో, ప్రజాసంక్షేమ కార్యకలాపాల్లో అతడు పెద్ద పెద్ద పనులు చేయలేడు. అందువల్ల, కొందరు వ్యక్తులు కలసిమెలసి సంస్థాగతంగా పనిచేయడం అవసరం. సంస్థ చాలా మంది వ్యక్తుల శక్తిసామర్థ్యాలను వినియోగించుకుంటుంది. అందువల్ల వ్యక్తికన్నా సంస్థ అతి శక్తిమంతమైనది. అందువల్ల పెద్ద పెద్ద పనులు సంస్థలకు సాధ్యపడతాయి. వ్యక్తిగతంగా సాధించడం కష్టమని భావించిన పని, సంస్థాగతంగా సునాయాసంగా పూర్తవుతుంది. అందువల్ల ప్రజాసంక్షేమం కోసం సంస్థాగతంగా పనిచేస్తే, కలసిమెలసి సమాజ సంక్షేమానికి కృషి చేస్తే వ్యక్తిగతంగా చేయలేని సేవా కార్యక్రమాలు ఇలా సంస్థాగతంగా నెరవేరుతాయి. ప్రజాసంక్షేమం కోసం సంస్థాగతంగా పనిచేయడాన్ని ఇస్లాం ఇష్టపడుతుంది. అలాటి పనులను ప్రోత్సహిస్తుంది. ఈ లక్ష్యం కోసం ముస్లిమేతర సంస్థలతోనూ సహకారం తీసుకోవడానికి తయారుగా ఉండమని వెన్నుతడుతుంది. ఎందుకంటే ఈ లక్ష్యాలు ఇస్లాం బోధనలకు అనుగుణమైనవి.

రసూలె అక్రం ముహమ్మద్ (స) అవతరణకు ముందు అరబ్బుల్లో దృఢమైన రాజకీయ వ్యవస్థ అంటూ ఏదీ లేదు. అందువల్ల ఓ విధమైన రాజకీయ, సామాజిక సంక్షోభం నెలకొని ఉండేది. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండేది. బలవంతుడు, బలహీనుడిని అణచివేసేవాడు. బలం గలవాడిని ఎవ్వరూ విమర్శించేవారు కాదు. చిన్న చిన్న కారణాలకే యుద్ధాలు, బీభత్సాలు జరిగేవి. అత్యాచారాలు అణచివేతలు పెట్రేగిపోయేవి. ఈ అమానుషాల్ని నిరోధించే వాడు ఎవడూ లేని కాలం అది. మక్కాలాంటి నగరంలోనూ పరిస్థితి ఏమంత మెరుగ్గా ఉండేది కాదు. ఈ పరిస్థితిని మార్చాలని కొందరు సమాజ శ్రేయోభిలాషులు భావించారు. సలహా సంప్రదింపుల కోసమని అబ్దుల్లాహ్



బిన్ జదాన్ ఇంటిలో సమావేశమయ్యారు. అత్యాచారాలను, అణచివేతలను ఎలాగైనా నిరోధించాలని నిర్ణయం తీసుకొన్నారు. మక్కా వాసులపైగాని, బయటి నుంచి వచ్చిన వారిపైగాని ఎవ్వరిపైననూ ఎలాటి దౌర్జన్యం జరుగనీయరాదని నిశ్చయించుకొన్నారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బాధితుడిని సమర్థించాలని, అతడికి న్యాయం చేకూర్చాలని, అవసరార్థులకు, నిస్సహాయులకు సహాయపడా లని అనుకొన్నారు.

రసూలుల్లా ముహమ్మద్ (స) కూడా ఆ సమావేశంలో ఉన్నారు. ఇది ముహమ్మద్ (స) ప్రవక్తగా అవతరించకముందు జరిగిన సంఘటన. కాని, ప్రవక్తగా నియుక్తులయిన తరువాత కూడా ఆయన ఆ సంఘటనను మెచ్చు కొంటూ, "నేను అబ్దుల్లాహ్ బిన్ జదాన్ ఇంటిలో ఎలాటి ఒప్పందంలో పాల్గొన్నా నంటే, ఆ ఒప్పందాన్ని నేను ఎర్ర ఒంటె (అరబ్బులకు అప్పట్లో ఓ పెద్ద సంపద) కన్నా ఎక్కువ ఇష్టపడతాను. ఇస్లాం తరువాత ఇప్పుడు కూడా నాకు అలాటి ఆహ్వానం వస్తే నేను అందులో తప్పక పాల్గొనడానికి అంగీకరిస్తాను."

అత్యాచారాలు, అన్యాయాలను నిర్మూలించడం, మానవ సంక్షేమానికి, మానవ సేవకు పనిచేసే సంస్థ సమాజానికి అత్యంత విలువైన పెట్టుబడి. అలాటి విలువైన పెట్టుబడి లేని సమాజాలు దివాళా తీస్తాయి. ఇస్లాం ఆ పెట్టుబడిని రక్షిస్తుంది, అభివృద్ధి చేస్తుంది.

**ప్రభుత్వ సహాయం:** ప్రజాసేవ చేసే సంస్థలలో అన్నిటికన్నా పెద్ద సంస్థ దేశం. వ్యక్తులు, సంస్థలు ఎంతటి శక్తిసామర్థ్యాలు కలిగి ఉన్నప్పటికీ వాటి శక్తియుక్తులు పరిమితమైనవి. సమాజానికి అన్ని విధాల సేవ చేసేందుకు అవసరమైన వనరులు వాళ్ళకు లభ్యం కావు. సామాజిక సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు అవసరమైన సాధనాలు కూడా లభ్యంకావు. కాని దేశం అసాధారణ వనరులను, సాధనాలను కలిగి ఉంటుంది. లక్ష్య సాధనకు వివిధ మార్గాలు అవలంబించగలదు. అందువల్ల సమాజంలోని ఏ వ్యక్తి నిత్యావసరాల కొరత నెదుర్కొనే విధంగా, తన అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు, అవకాశాలు అతడికి లభ్యమయ్యేలా పూర్తి సమాజాన్ని తయారు చేయడం సంక్షేమాన్ని

వాంఛించే ఉత్తమ రాజ్యపు నైతిక బాధ్యత. రాజ్యం ఈ బాధ్యతను గుర్తించకపోతే దాని ఉనికే అర్థంలేనిదవుతుంది. అయితే రాజ్యం ఇంత పెద్ద బాధ్యతను పూర్తిగా నెరవేర్చాలంటే పౌరుల సహాయ సహకారాలు ఎంతైనా అవసరం. కేవలం రాజ్యం చేసే ప్రయత్నాలతో సమాజంలోని పేదరికం, అజ్ఞానం, నిరుద్యోగం, అనారోగ్యం లాంటి సమస్యలు పరిష్కృతం కావు. ప్రతి పౌరునిలోనూ సమాజాన్ని సంస్కరించే, పైకి లాగే దృఢచిత్తం ఉండటం అవసరం. రాజ్యంతోపాటు పౌరులు కలసి సహాయ సహకారాలందించినప్పుడే ప్రజాసేవ హక్కులు నెరవేరుతాయి. అలాకాకపోతే ఈ పని అర్థాంతరంగానే ఉండిపోతుంది.

## ప్రజాసేవ విస్తృత రూపం

ఎవరికైనా ధన సహాయం చేయడం, అవసరాలు తీర్చడం మాత్రమే ప్రజాసేవ కాదు. ప్రేమ, సానుభూతి, ఉత్తమ నైతిక వర్తనం ఇవన్నీ ప్రజాసేవలోకే వస్తాయి. దీనిని మంచి వ్యవహారశైలిగా పేర్కొనడం జరుగుతుంది. కడుపు నింపుకోవడానికి రెండు పూట్ల అన్నం, కట్టుకోడానికి బట్టలు, ఉండటానికి ఇల్లు–ఇవి మాత్రమే మనిషికి అవసరాలు కావు. జబ్బుపడినప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. అంతేకాదు, అతడు పేదవాడు, నిస్సహాయుడు అయితే అతడ్ని అగౌరవంగా, అమర్యాదగా చూడరాదు. అందరితో సమానంగా చూడాలి. అతడి మందులకు, వైద్యానికి ఏర్పాట్లు చేయడమేకాక అతడికి సేవ కూడా చేయాలి. అతడిలోని సుగుణాలను గుర్తించాలి. అతగాడి వల్ల ఏదన్నా తప్పు జరిగితే ఉపేక్షించాలి. అతడి సుఖ దుఃఖాలలో పాలుపంచుకోవాలి. ధన సహాయంతో పాటు, మాట మంతి, కలివిడితనం ప్రదర్శిస్తూ నైతికంగా ఉన్నత వైఖరిని ప్రదర్శించాలి. ఖుర్ఆన్, హదీసుల ప్రకారం అలా ప్రవర్తించని పక్షంలో సేవ, మంచి వ్యవహారశైలి అన్నవి సంపూర్ణం కావు. దానికి మంచి ఉదాహరణ ఏమంటే, తల్లిదండ్రులు సంతానం తమకు అన్నపానీయాల వస్త్రాల ఏర్పాట్లు చేయాలని మాత్రమే కోరరు. సమాజంలో తాము ఒంటరిగా, చేతకానివారిగా మిగిలిపోయామన్న నిరాశ తమలో కలుగనీయకుండా తమ వార్థక్యపు చింతలను



దూరం చేసే ప్రేమాభిమానాల కోసం వారు పరితపిస్తారు. తమ వార్థక్యాన్ని, వయస్సుతోపాటు జవసత్వాలు ఉడిగిపోవడాన్ని తమ సంతానం సానుభూతితో అర్థం చేసుకొని, తమను పెద్దలుగా గౌరవించాలని, తమతో మంచిగా, గౌరవ మర్యాదలతో వ్యవహరించాలని కోరుతారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యతను ఖుర్ఆన్ సంతానంపై పెట్టలేదు. కాని తల్లిదండ్రులతో మంచిగా మెలగాలని బోధించింది. ఈ బోధనల్లో పోషణ బాధ్యత పరోక్షంగా ఉంది. తల్లిదండ్రులతో ఎలా వ్యవహరించాలని ఖుర్ఆన్ చెబుతుందో చూడండి :

> **"తల్లిదండ్రులలో ఇద్దరూగాని, లేక ఏ ఒక్కరుగాని వృద్ధులై ఉంటే వారితో కనీసం 'ఉఫ్' అని కూడా అనరాదు. వారిని ఈసడించవద్దు. వారితో అణకువగా, మర్యాదగా మాట్లాడండి. పసితనంలో మిమ్మల్ని ఎంత ప్రేమగా పెంచారో అదే మాదిరిగా వారిపై కరుణ చూపమని దైవాన్ని ప్రార్థించండి."** **(బనీ ఇస్రాయీల్: 23–24)**

కొన్ని పరిస్థితుల్లో సానుభూతితో కూడిన ఓ మాట, ప్రేమతో పలికిన ఓ పలుకు– ధన సహాయం కన్నా చాలా విలువైనదిగా ఉంటుంది. ఖుర్ఆన్ తియ్యటి మాటలకు, ఉదాత్త సంబోధనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఓ చోట, నమాజ్, జకాత్‌ల కన్నా ముందు ఈ విషయాన్ని ప్రస్తావించింది.

> **"ప్రజలతో మంచిగా మాట్లాడండి. నమాజు స్థాపించండి. జకాత్ ఇవ్వండి."** **(అల్ బఖర : 83)**

ఓ నిరుపేదవానికి ధన సహాయం ద్వారా సేవ చేయవచ్చు. కాని ధనికుడయిన వ్యక్తికి మన డబ్బుతో ఎలాటి అవసరమూ లేదు. కాని సానుభూతి, ప్రేమ, మంచి వ్యవహారశైలి మాత్రం ప్రతి మనిషికీ కావాలి. ఈ అవసరాన్ని ఏ ధనవంతుడూ కాదనలేడు. ఏ బీదవాడూ కాదనడు.

## సేవా కార్యక్రమాల గురించి మరికొన్ని విషయాలు

హదీసుల్లో సేవా కార్యక్రమాల మరో దృక్కోణం చాలా ప్రముఖంగా కనబడుతుంది. మానవుల సేవ కేవలం రూపాయలు, పైసలతో మాత్రమే

చేయలేం. అంగవికలుడికి సహాయపడడం, అంధుడికి దారి చూపడం, దారిలోని అడ్డంకిని తొలగించడం, ఎవరికన్నా నీళ్ళు తోడి ఇవ్వడం, చివరికి ఎవరినన్నా నవ్వుముఖంతో పలుకరించడం– ఇవన్నీ సేవాకార్యాలే. మంచి వ్యవహార రీతులే. డబ్బు ఖర్చు చేయడం వలే ఇది కూడా దాతృత్వమే (సదఖాయే).

**హజ్రత్ అబూ మూసా అషరి (రజి) ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "దానం చేయడం ప్రతి ముస్లిం బాధ్యత." అప్పుడు సహచరులు ఆయనతో, "ఎవరి వద్దనన్నా దానం చేయడానికి ఏమీ లేకపోతే అప్పుడు ఏం చేయాలి?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త, " కష్టించి పనిచేసి సంపాదించిన దాంతో స్వయంగా లాభం పొంది ఇతరులకూ లాభం చేకూర్చాలి" అని అన్నారు. దానికి సహచరులు, "కష్టించే శక్తి లేకపోతే ఏం చేయాలి?" అని మళ్ళీ అడిగారు. దానికి ప్రవక్త (స), "ఎవరయినా అగత్యపరుడిని, కష్టాల్లో ఉన్నవాడిని (ధన సహాయం కాక మరే విధంగా నయినా) సహాయపడాలి" అని అన్నారు. అప్పుడు సహచరులు మళ్ళీ, "ఆ మాత్రం శక్తి కూడా లేకపోతే ఏం చేయాలి" అని అడిగారు. దానికి ప్రవక్త, "మంచి పనులు చేయమని ఆదేశించాలి" అన్నారు. "ఆ పని కూడా చేయలేకపోతే" అనడిగారు సహచరులు. దానికి ప్రవక్త, "ఆ వ్యక్తి చెడులకు దూరంగా ఉండాలి. ఇది కూడా ఆ వ్యక్తి కోసం దానం (సదఖా) ఇవ్వడం వంటిదే" అని అన్నారు. (మిష్కాత్)**

**ఓసారి ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "సూర్యుడు ఉదయించినప్పటి నుంచి మనిషిపై సదఖా (దానం) బాధ్యతగా మారుతుంది. (సదఖా, కేవలం ధనం రూపంలోనే కాదు) ఇద్దరు వ్యక్తుల నడుమ న్యాయాన్ని చేయండి. అది కూడా సదఖాయే. ఎవరికయినా వాహనం ఎక్కడానికి సహాయపడండి ఇది కూడా దానమే. వాహనంపై సామానులు పెట్టడంలో చేయందించండి. ఇది కూడా సదఖాయే. నోటితో మంచిమాటలు పలకండి. ఇది కూడా సదఖాయే. అలాగే నమాజ్ కొరకు మీరు వేసే**



**ప్రతి అడుగు సదఖాయే. దారిలో ఆటంకంగా ఉండి, కష్టపెట్టే వస్తువుల్ని తొలగించండి, ఇది కూడా సదఖాయే." (ముస్లిం)**

**ఓసారి మహాప్రవక్త (స) నరకబీభత్స దృశ్యాన్ని ప్రస్తావిస్తూ, "దానం చేయడం ద్వారా నరకం నుంచి తప్పించుకోండి. మీ వద్ద ఏమీ లేకపోతే కనీసం ఎండు ఖర్జూరపు ఓ ముక్కయినా ఇవ్వండి. అదీ లేకపోతే నోటితో మంచి మాటలు ఉచ్చరించి నరకాగ్ని నుండి తప్పించుకోండి" అని అన్నారు. (బుఖారి)**

**మరో హదీసులో ఆయన (స) "ప్రతి పుణ్యకార్యమూ సదఖా (దానం)యే" అని అన్నారు.**

మానవ సేవ, మానవ సంక్షేమాల పరిధి ఎంత విస్తృతమయినదంటే ప్రతి మనిషి ఈ విషయంలో తన బాధ్యత నెరవేర్చగలడు. ప్రతి మనిషి ఈ బాధ్యత నెరవేర్చవలసి ఉంది. అందుకోసం మనిషి భాగ్యవంతుడే అయి ఉండవలసిన అవసరం లేదు. ప్రభుత్వ సహాయమూ అక్కరలేదు. వాస్తవమేమంటే, సంపద, భోగభాగ్యాలు, ప్రభుత్వాధికారం – వాటివల్ల కేవలం కొన్ని రంగాల్లో మాత్రమే మానవ సేవ సాధ్యపడుతుంది. కాని, అనేక రంగాలలో వ్యక్తిగతమైన ఉన్నత నైతికత, ఉత్తమ నడవడి చాలా పనికి వస్తాయి. ప్రభుత్వాలు అంగవికలురకు ధన సహాయాన్ని, నిరుద్యోగులకు ఉపాధిని, ఇల్లు లేనివారికి ఇంటిని, వ్యాధిగ్రస్తునికి వైద్య సహాయాన్ని మాత్రమే ఇవ్వగలవు. కాని, ఎన్ని వనరులు ఉన్నప్పటికీ, తండ్రి, కొడుకు, సోదరుడు, స్నేహితుడు తదితరులు తోడుగా ఉండరు. ఈ వ్యక్తుల ద్వారా లభించే సౌఖ్యం, అనుభూతులు ప్రభుత సహాయం వల్ల లభ్యం కావు.

**విచక్షణారహిత సేవ:** ప్రజాసేవ అన్నది కేవలం ఓ ప్రత్యేక జాతి లేదా సమాజానికి పరిమితం కాదు. పూర్తి మానవులకు చేయాలి. తన వారితోనూ, పరులతోనూ మంచి వ్యవహారశైలిని ప్రదర్శించాలి. తన విశ్వాసం, తన సిద్ధాంతాన్ని పాటించే వారితోనూ తన అభిప్రాయాలతో విభేదించే వారితోనూ ఒకే విధంగా ప్రవర్తించాలి. మన భాష మాట్లాడే వారితోనూ, వేరే భాషలు

మాట్లాడేవారితోనూ సమానంగా మెలగాలి. ఇదే పవిత్ర ఖుర్‌ఆన్ ఇచ్చే శిక్షణ. హదీసులు కూడా ఈ విషయాన్నే నిరూపిస్తున్నాయి. అందువల్ల ఖుర్‌ఆన్ నిరుపేదలతో, అవసరార్థులతో, అంగవికలురతో, అనాథలతో మంచిగా ప్రవర్తించాలని, వారికి సేవ చేయాలని ఆదేశించింది. ఓ ప్రత్యేక జాతికి, కులానికి, సమాజానికి మాత్రమే సేవ చేయాలని, ఇతరులకు చేయరాదని ఎక్కడా చెప్పలేదు.

ప్రజలను జాతులుగా, సమాజాలుగా విభజించి, కొందరితో మంచిగా వ్యవహరిస్తూ సేవచేస్తూ, మిగిలిన వారు అందుకు అనర్హులని భావించడం సముచితంగాదు. ఈ భావాలు ఖుర్‌ఆన్ శిక్షణకు వ్యతిరేకమయినవి.

హదీసుల్లో ఈ వాస్తవం చాలా స్పష్టంగా ఉంది. క్రింద కొన్ని హదీసులు పేర్కొన్నాం చూడండి:

1. **హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "మానవుల పట్ల కరుణచూపని వారిపై దైవం కరుణ చూపడు." (బుఖారి)**

2. **హజ్రత్ అనస్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దైవ సృష్టితాలు దేవుని సంతానం. తన పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించే వ్యక్తి దైవానికి అందరికన్నా ఇష్టుడు." (బైహఖి)**

3. **హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), ముహమ్మద్ ప్రవక్త (స) అన్న ఈ మాటలను ఉటంకించారు: "మనుష్యుల పట్ల కరుణచూపేవారి పైన్నే ఆ కరుణామయుడైన ప్రభువు కరుణ చూపుతాడు. (అందువల్ల) భూమిపై ఉన్నవారిపట్ల కరుణ చూపండి. ఆకాశంలో ఉన్నవాడు మీ పట్ల కరుణ చూపుతాడు." (అబూ దావూద్, తిర్మిజి)**

4. **హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం రసులుల్లా సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు: "కరుణ, సానుభూతి అనేవి దౌర్భాగ్యుడి హృదయం నుంచి తొలగించ బడతాయి." (అహ్మద్, తిర్మిజి)**



5. **హజ్రత్ అబూ హురైరా (రజి) ఉటంకించారు: కొంత మంది కూర్చొని ఉండగా హుజూర్ అక్రం (స) అక్కడకు వచ్చి, 'మీలో మంచి వాడెవరో? చెడ్డవాడెవరో? నేను చెప్పనా!' అన్నారు. ఆయన (స) ప్రశ్న విని ప్రజలు మౌనం వహించారు. కాని ప్రవక్త (స) మూడు సార్లు ఆ ప్రశ్నను మళ్ళీ మళ్ళీ అడిగినప్పుడు ఓ వ్యక్తి, 'ఓ ప్రవక్తా! (స) చెప్పండి మాలో మంచి వాడెవరు? చెడ్డవాడెవరు?' అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "మీలో ఎవరైతే మంచి పనులు చేస్తాడని, ప్రజలకు ఎలాంటి కష్టం కలిగించడని ఆశించగలమో అలాంటి వ్యక్తి ఎంతో మంచి వాడు. అలాగే మీలో ఎవరైతే మంచి పనులు చేస్తారని ఆశించలేమో, ఎవరి దుష్ప్రవర్తన వల్ల ప్రజలకు భద్రత ఉండదో అలాంటి వ్యక్తి పరమ చెడ్డవాడు." (తిర్మిజి)**

ఈ హదీసుల్లో ఎలాంటి కుల,మత,జాతి విచక్షణ లేకుండా దైవదాసులయిన మనుష్యులందరి పట్ల మంచి వ్యవహారశైలిని ప్రదర్శించాలన్న శిక్షణ ఉంది. నిరుపేదలకు, వితంతువులకు, అనాథలకు, కష్టాల్లో ఉన్నవారిని, వ్యాధిగ్రస్తులకు, బానిసలకు, ఖైదీలకు సేవ చేయడానికి ఎలాటి షరతులు విధించబడలేదు. మన సానుభూతి, సహాయం అవసరమున్న వ్యక్తికి సహాయం చేయాలని, ఈ విషయంలో తన, పర భేదం చూపరాదని, సహాయానికి కొందరు అర్హులని, మరికొందరు అనర్హులని భావించడం ఇస్లాంకు వ్యతిరేకమని ఈ హదీసులు తెలుపుతున్నాయి.

ఈ హదీసుల్లోని మరో కోణం ఏమంటే, ఇవి ప్రజాసేవ ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. రాత్రింబవళ్ళు చేసే ఆరాధనకు సమానమైన ఈ పని, మనిషికి దైవప్రేమ, దైవసామీప్యం లభించేలాజేసే ఈ పని, మనిషిపై దైవకారుణ్యం కురిపించే ఈ పని, పాషాణ హృదయం, సంకుచిత మనస్తత్వం లాంటి రుగ్మతలను దూరం చేసి, వ్యక్తిని మంచివాడిగా, సంక్షేమ కర్తగా, సమాజంలోని ఉత్తమ వ్యక్తిగా తీర్చిదిద్దే ఈ పని, ఔన్నత్యం, ప్రాముఖ్యాలను ఏ ముస్లిం కాదనగలడు? ఈ పని చేయడానికి మనిషికి వీటిలో లభించే అపార ప్రేరణ, శిక్షణల తర్వాత మరే ఇతర ప్రేరణ అవసరం లేనేలేదు.

**-: సమాప్తం :-**

మానవ సేవ